సాక్షి
నల్లగొండ
గురువారం। 19। జూన్। 2025



సాగర్ స్పిల్‌వే పరిశీలన
నాగార్జునసాగర్ డ్యాం స్పిల్‌వేను మరమ్మతుల నిపుణుల బృందం బుధవారం పరిశీలించింది. - 8లో



అబద్ధాలతో కాంగ్రెస్ పాలన
కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో పాలన సాగిస్తోందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. - 8లో



ఏటీఎంల వద్ద..
అమాయకుల ఏటీఎం కార్డులను తస్కరించి డబ్బులు కాజేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

జంతు సంరక్షణకు కృషిచేయాలి



మాట్లాడుతున్న నారాయణ్ అమిత్

నల్లగొండ : జంతు సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన 'జంతువులపై క్రూరత్వ నివారణ' జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జంతు సంరక్షణకు జంతు హింస నివారణ కమిటీ ద్వారా సొసైటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. జంతువులకు హాని కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే రాజ్యాంగ ప్రకారం శిక్షార్హులని తెలిపారు. కుక్కల సంతతిని తగ్గించేందుకు ఆడ కుక్కలకు టీకాలు వేయాలని, జంతువులకు కావాల్సిన ఆహారం, మంచినీటి సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ డాక్టర్ జివి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యువజన క్రీడల అధికారిగా అక్బర్ అలీ

నల్లగొండ టూటౌన్ : జిల్లా యువజన క్రీడల అధికారిగా అక్బర్ అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన మక్బుల్ అహ్మద్ ఉద్యోగ విరమణ చేయడంతో.. అప్పటి నుంచి ఇన్‌చార్జిగా కుంభం నర్సిరెడ్డి బాధ్యతలు నిర్వర్తించారు. ఖమ్మం జిల్లా యువజన, క్రీడల అధికారిగా పని చేస్తున్న అక్బర్ అలీ బదిలీపై నల్లగొండకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అక్బర్ అలీకి కార్యాలయ ఉద్యోగులు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎడమకాల్వకు మరమ్మతులు చేపట్టాలి



కోతకు గురైన సాగర్ ఎడమకాల్వ కట్టను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : సాగర్ ఎడమకాల్వ కట్టలు లైనింగ్ లేక కోతలకు గురవుతున్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి మిర్యాలగూడ మండలంలోని దొండవారిగూడెం బ్రిడ్జి 41వ మైల్ వద్ద కోతకు గురవుతున్న కాల్వకట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడమకాల్వకు కొన్ని చోట్ల సీసీ లైనింగ్ చేయకుండా వదిలేయడంతో కట్టలు బలహీనంగా మారి కోతకు గురై తెగిపోయే ప్రమాదం నెలకొంటుందన్నారు. ఇటీవల మిర్యాలగూడలో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాల్వకట్టల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారని.. కానీ ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదన్నారు. కాల్వలకు నీటిని విడుదల చేసేలోపు కట్టలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, మల్లు గౌతంరెడ్డి, బొగ్గరపు కృష్ణయ్య, రెమిడాల భిక్షం, ఎల్లయ్య పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలతో ఆరోగ్యానికి ముప్పు



టీ పొడి నాణ్యతను పరీక్షిస్తున్న సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : కల్తీ ఆహార పదార్థాలు వినియోగిస్తే ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ ఎన్.శివశంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఫుడ్ సేఫ్టీ అధికారులు 13 హోటళ్లను తనిఖీ చేశారు. ఆ దుకాణాల్లో టీ పొడి, పాలపదార్థాల నాణ్యత పరిశీలించారు. వివిధ ఆహార పదార్థాలు మొబైల్ ఫుడ్ పరీక్షల ల్యాబ్‌లో వెంటనే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని టీ పొడి, ఆహార పదార్థాలు వాడుతున్నట్లు పరీక్షల్లో తేలగానే వాటిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యం చేస్తే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ సిబ్బంది ఎం.వెంకటపతి, రమేష్ పాల్గొన్నారు.

కొత్తగా 3 అసెంబ్లీ సెగ్మెంట్లు

ఉమ్మడి జిల్లాలో మూడు కొత్త నియోజకవర్గాలు ఏర్పడనున్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 15కు పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో నియోజకవర్గాలను పెంచాలన్న నిబంధన ఉంది. అయితే 2021లో జరగాల్సిన జనగణన ఆలస్యం కావడంతో నియోజకవర్గాల పునర్విభజన ఆగిపోయింది. కేంద్ర ప్రభుత్వం జనగణనకు రెండు రోజుల కిందట గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో మళ్లీ నియోజకవర్గాల పునర్విభజన చర్చ తెరపైకి వచ్చింది. ఈసారి నియోజకవర్గాల పునర్విభజనను 2027 జనాభా లెక్కల ప్రకారం భౌగోళిక అంశాలు, పరిపాలన సౌలభ్యం పరిగణనలోకి తీసుకొని ఆ జిల్లాల్లోనే నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, గ్రామాలు ఉండేలా చేసే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో 15కు చేరనున్న నియోజకవర్గాల సంఖ్య

- యాదాద్రి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున..
- 2027 జనాభా లెక్కల అనంతరం పునర్విభజన
- ఆయా జిల్లాల పరిధిలోనే అన్ని నియోజకవర్గాలు
- గతంలో రద్దయిన నియోజకవర్గాల పేర్లు మళ్లీ తెరపైకి..
- అసెంబ్లీ సెగ్మెంట్ల పునర్విభజనపై జోరుగా చర్చ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో నియోజకవర్గాలను పెంచాలన్న నిబంధన ఉంది. అయితే, 2021లో జరగాల్సిన జనగణన ఆలస్యం కావడంతో నియోజకవర్గాల పునర్విభజన ఆగిపోయింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జనగణనకు రెండు రోజుల కిందట గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో మళ్లీ నియోజకవర్గాల పునర్విభజన చర్చ తెరపైకి వచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం 12 నియోజకవర్గాలు ఉన్నాయి. 2001 జనాభా లెక్కల ప్రకారం 2008 చివరలో నియోజక వర్గాలను పునర్‌వ్యవస్థీకరించారు. అంతకుముందు ఉమ్మడి నలగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండేవి. 2008 పునర్విభజన తర్వాత కూడా ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలున్నాయి. అదనంగా ఏమీ పెరుగలేదు. అప్పట్లో రామన్నపేట నియోజకవర్గం రద్దయి, కొత్తగా హుజూర్‌నగర్ ఏర్పడగా, చలకుర్తి నియోజకవర్గం స్థానంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంగా ఏర్పడింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా జనాభా 50 లక్షల వరకు పెరిగినట్లు అంచనా. దాని ప్రకారం మూడు నియోజకవర్గాలు కొత్తగా ఏర్పడనున్నాయి. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి జిల్లాల్లో ఒక్కో నియోజకవర్గం పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు, రాజకీయ నేతలు చెబుతున్నారు.

జిల్లా పరిధి మారకుండా పునర్విభజన

నియోజకవర్గాల పునర్విభజనను భౌగోళిక అంశాలు, పరిపాలన సౌలభ్యం పరిగణనలోకి తీసుకొని ఆ జిల్లాల్లోనే నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, గ్రామాలు ఉండేలా చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం కొన్ని మండలాలు ఒక జిల్లా పరిధిలో ఉండగా, మరికొన్ని మండలాలు మరో జిల్లా పరిధిలోని నియోజకవర్గంలో ఉన్నాయి. రామన్నపేట, మోత్కూరు, చౌటుప్పల్, నారాయణపూర్, శాలిగౌరారం మండలాలే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో ఒక నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాలు అదే జిల్లాలో ఉండేలా పునర్విభజన చేసే అవకాశం ఉంది. మరోవైపు 2027లో పూర్తయ్యే జనగణన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. కేంద్ర ఎన్నికల సంఘం జనాభా ప్రతిపాదికన.. లేక ఓటర్ల ప్రాతిపదికన నియోజక వర్గాలను ఏర్పాటు చేస్తుందా అనేది కూడా తేలాల్సి ఉంది.

తెరపైకి పాత నియోజకవర్గాలు..

గతంలో రద్దయిన పాత నియోజకవర్గాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. 2027లో జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరుగనుంది. అయితే మూడు నియోజకవర్గాలు కొత్తగా ఏర్పడనున్నందున అందులో తిరిగి రద్దయిన పాత నియోజకవర్గాల పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. మరోవైపు నలగొండ, సూర్యాపేట పట్టణాల్లో అర్బన్, రూరల్ నియోజకవర్గాలు ఏర్పాటు చేస్తారన్న చర్చ జరగుతోంది.

నల్లగొండ అర్బన్, రూరల్ నియోజకవర్గాలుగా..

నల్లగొండ జిల్లా కేంద్రంలో నల్లగొండ నియోజకవర్గం రెండు నియోజకవర్గాలుగా ఏర్పడతాయన్న చర్చ గత కొంత కాలంగా సాగుతోంది. నల్లగొండ పట్టణంలో రెండు లక్షలపైగా జనాభా, 1.20 లక్షల వరకు ఓటర్లున్నారు. నల్లగొండ పట్టణంతో పాటు రూరల్ మండలం కలుపుకుని నల్లగొండ అర్బన్ నియోజక వర్గంగా ఏర్పాటు చేస్తారనే చర్చ జరుగుతోంది. మరోవైపు కనగల్, తిప్పర్తి, మాడుగులపల్లి మండలాలను కలుపుకొని నల్లగొండ రూరల్ నియోజకవర్గంగా ఏర్పాటు చేయవచ్చనే చర్చ సాగుతోంది.

సూర్యాపేటలోనూ అర్బన్ నియోజకవర్గం

ప్రస్తుతం సూర్యాపేట నియోజకవర్గంలో సూర్యాపేట టౌన్‌తో పాటు రూరల్ మండలాన్ని కలుపుకొని సూర్యాపేట అర్బన్ నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేస్తారన్న చర్చ సాగుతోంది. సూర్యాపేట రూరల్ నియోజకవర్గాన్ని ఆత్మకూర్ (ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్, ప్రస్తుతం కోదాడలోని మోతె మండలాలను కలుపుతూ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అయితే నాగారం నియోజకవర్గం ఏర్పాటైతే సూర్యాపేట రూరల్ నియోజకవర్గం ఉండకపోవచ్చని, సూర్యాపేట రూరల్ ఉంటే నాగారం నియోజకవర్గం ఏర్పాటు చేసే అవకాశం ఉండదనే చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతోంది.

33 శాతం మహిళా రిజర్వేషన్..

కొత్తగా ఏర్పాటు చేసే నియోజకవర్గాల పునర్విభజనతోపాటు 33 శాతం చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల కోసం కేంద్రం చర్యలు చేపడుతోంది. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో దీనిని కచ్చితంగా అమలు చేసే అవకాశం ఉంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోనూ 2028 అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు సీట్లు మహిళలకే దక్కనున్నాయి.

నాగారం నియోజకవర్గం కూడా..

ప్రస్తుతం తుంగతుర్తి నియోజకవర్గంలోని నాగారంను కూడా నియోజకవర్గం చేస్తారనే చర్చ జరుగుతోంది. నాగారం గతంలో నియోజవర్గంగా ఉంది. అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి 1962లో ఎ.రంగారెడ్డి గెలుపొందారు. అయితే 1966లో ఆ నియోజకవర్గం రద్దయి, తుంగతుర్తి ఏర్పడింది. ప్రస్తుతం నియోజకవర్గాల పునర్విభజనలో మళ్లీ దానిని ఏర్పాటు చేస్తారన్న చర్చ సాగుతోంది. నాగారంను తిరిగి నియోజకవర్గంగా చేయాల్సివస్తే నాగారం, అడ్డగూడురు, తిరుమలగిరి, అర్వపల్లి మండలాలతో చేసే అవకాశం ఉంది.

రామన్నపేట లేదంటే చౌటుప్పల్..

ప్రస్తుతం రామన్నపేట మండలం యాదాద్రి జిల్లాలో ఉన్నప్పటికీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధి మాత్రం నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ నియోజకవర్గంలో ఉంది. ఇప్పుడు మళ్లీ రామన్నపేట నియోజకర్గం ఏర్పాటు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఒకవేళ రామన్నపేట నియోజకవర్గం ఏర్పడితే దాని పరిధిలో రామన్నపేట మండలంతో పాటు వలిగొండ, ఆత్మకూర్ (ఎం), చౌటుప్పల్, నారాయణపూర్, భూదాన్ పోచంపల్లి మండలాలతో కలిపి నియోజకవర్గంగా ఏర్పడే అవకాశం ఉంది. లేదంటే అదే జిల్లాలో ప్రస్తుతం రెవెన్యూ డివిజన్‌గా ఉన్న చౌటుప్పల్‌నే నియోజకవర్గ కేంద్రంగా చేసి ఇదే మండలాలతో కొత్త నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశం కూడా లేకపోలేదు. ఇక శాలిగౌరారం మండలాన్ని నకిరేకల్ నియోజకవర్గంలో కలిపే అవకాశం ఉంది.

'విహారం' విషాదాంతం కావొద్దు

- ఎస్పీ శరత్ చంద్రపవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

చందంపేట : విహార యాత్రలు విషాదాంతం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. బుధవారం నేరెడుగొమ్ము మండలం కృష్ణా నది వెనుక జలాల సమీపంలోని వైజాక్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా వెనుక జలాల్లో బోటింగ్ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, సామర్థ్యానికి మించి పర్యాటకులను తీసుకెళ్లొద్దని సూచించారు. బోటింగ్, ఈత సమయంలో మద్యం సేవించరాదని పేర్కొన్నారు. పోలీసు నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నేరెడుగొమ్ము పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డును పరిశీలించి పెండింగ్ కేసుల పూర్వాపరాలను ఎస్‌ఐ కోటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ ఉమాదేవి, సీఐ బీసన్న, ఎస్‌ఐ కోటేష్, బంగారి, తాతారావు, యేసు రత్నం తదితరులు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

నల్లగొండ : మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. మంగళవారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులను బుధవారం నల్లగొండ స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఒక వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష రూ.1,000 జరిమానా, మరొకరికి ఒక రోజు జైలు శిక్ష, రూ.2,000 జరిమానా, మరో ఇద్దరికి రూ.10,000 జరిమానా విధించారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నల్లగొండ ట్రాఫిక్ సీఐ జి.మహాలక్ష్మయ్యను, సిబ్బందిని అభినందించారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ

నల్లగొండ : సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ కం మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీజీబీసీ ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం సంచాలకులు ఖాజా నజీమ్ అలీఅఫ్సర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి జూలై 8వ తేదీ వరకు tgbcstudycircle.cgg .gov.in లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 12న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండ, ఫోన్ నంబర్ (08682 220007)లో సంప్రదించాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు



యోగా డే పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, అధికారులు

నల్లగొండ : యోగా దినోత్సవ పోస్టర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. యోగాతో ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, ఆయుష్ డిపార్టుమెంట్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.కళ్యాణ్, జిల్లా యువజన క్రీడల అధికారి అక్బర్ అలీ, పీఓ కృష్ణకుమారి, డీపీఓవిష్ణు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్ : మాతా శిశు సంరక్షణ సేవల్లో భాగంగా గర్భిణులకు మూడు నెలల్లోపే సరైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నెలాఖరులోగా నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేసి జిల్లాకు పేరు తేవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన కనగల్, పెద్దవూర పీహెచ్‌సీ వైద్యాధికారులను అభినందించారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి సబ్ సెంటర్‌లో ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 7.30 వరకు యోగాడేను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డాక్టర్ కృష్ణవేణి, డెమో డాక్టర్ తిరుపతిరావు, డీపీఓ విష్ణు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల భగీరథ ప్రయత్నం



పెద్దవూరలో పత్తి మొక్కలకు స్ప్రింక్లర్ల ద్వారా అందుతున్న నీరు

పెద్దవూర : వాతావరణ శాఖ అధికారులు ఈ ఏడాది వర్షాలకు కొదవలేదని చెప్పడంతో చాలా గ్రామాల్లో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. పది రోజుల క్రితం కొద్దిపాటి వర్షం పడటంతో చాలీచాలని పదునులో రైతులు పత్తి విత్తనాలు వేశారు. మొక్కలు సరిగా మొలక రాకపోవడంతో పాటు మొలిచిన మొక్కలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు మొదలుపెట్టారు. కొందరు రైతులు సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్లు వేసి డ్రిప్‌లు, స్ప్రింక్లర్లతో నీటి తడులు అందిస్తూ మొక్కలను సంరక్షించే పనిలో నిమగ్నమయ్యారు.

హైవేపై 'అనధికారిక' ప్రకటనలు!

- అనుమతి ఇచ్చింది ఒక ఏజెన్సీకి.. హోర్డింగ్స్ పెడుతోంది మరో ఏజెన్సీ
- మిర్యాలగూడ పరిధిలో కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ఏర్పాటు
- సుప్రీంకోర్టు నిబంధనలు బేఖాతరు



పట్టణంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లాలీపప్ హోర్డింగ్స్



ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పాటు చేసిన యాడ్స్‌కు సంబంధించిన హోర్డింగ్స్

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణ పరిధిలో కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై హోర్డింగ్‌ల వ్యవహారం ఇష్టానుసారంగా మారింది. వాటి నిర్వహణకు సంబంధించి ఒకరికి అనుమతులు ఉంటే.. అది తెలుసుకోకుండానే మరొకరికి అనుమతులు ఇచ్చారు. తీరా అది తెలిశాక తప్పు జరిగిందని అనుమతులు రద్దు చేశారు. హైవేల వెంట ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయవద్దని సుప్రీంకోర్టు గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా అధికారులు దాన్ని పట్టించుకోకుండా ప్రకటనలకు అనుమతిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన సాగర్ రోడ్డు వెంట హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

780 ప్రకటనల బోర్డులు మంజూరు..

కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి మిర్యాలగూడ పట్టణం గుండా వెళ్లింది. రాంనగర్ బంధం నుంచి సుందరయ్య చౌరస్తా, హౌసింగ్‌బోర్డు, రాజీవ్‌చౌక్ మీదుగా సాగర్‌రోడ్డు వెంట పొట్టి శ్రీరాములు చౌక్, ఆర్టీసీ బస్టాండ్, రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి హనుమాన్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి వెంకటాద్రిపాలెం శివారు వరకు పట్టణం విస్తరించి ఉంది. నల్లగొండ రోడ్డు.. వై జంక్షన్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉంది. నేషనల్ హైవే రోడ్డు పరిధిలోని డివైడర్ల మధ్యలో హోర్డింగ్‌లు, ఇతర ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయాలంటే నేషనల్ హైవే అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ సూర్యాపేటకు చెందిన శ్రీగీతా యాడ్స్ ఏజెన్సీకి పట్టణ పరిధిలో 10మీటర్లకు ఒకటి చొప్పున లాలీపప్ బోర్డులు ఏర్పాటు చేసుకునేందుకు ఈనెల 6న ఆర్‌అండ్‌బీ శాఖ అనుమతి ఇచ్చింది. మొత్తం 3 వేల మీటర్ల వరకు మున్సిపాలిటి పరిధిలో 780 ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో ప్రతి పది మీటర్లకు ఒక లాలీపప్ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నాయకులతో కూడిన ఫ్లెక్సీలను అంటించారు. కానీ.. గత సంవత్సరం నవంబర్‌లోనే బాలాజీయాడ్ ఏజెన్సీ రూ.3.40 లక్షలు చలానా చెల్లించి టెండర్ దక్కించుకుంది. ఈ ఏజెన్సీకి ఐదు సంవత్సరాల పాటు నేషనల్ హైవే అథారిటీ అగ్రిమెంట్ చేసింది. ఇది తెలియక ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సూర్యాపేటకు చెందిన గీతాయాడ్స్ ఏజెన్సీకి అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత నేషనల్ హైవే అధికారులు బాలాజీయాడ్స్‌కు లీజుకు ఇచ్చినట్లు తెలియడంతో గీతా యాడ్స్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తూ ఈనెల 4న ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రమాదాలకు నిలయంగా ప్రకటన బోర్డులు..

జాతీయ రహదారుల వెంట ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేయవద్దని గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. డివైడర్ల మధ్యలో ప్రకటనలను ఏర్పాటు చేయడం వల్ల వచ్చిపోయే వాహనదారుల దృష్టి తప్పడంతోపాటు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భావించి వాటిని నిషేధించింది. మిర్యాలగూడ పట్టణంలో నేషనల్ హైవే డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన లాలీపప్ బోర్డుల వల్ల ప్రమాదం పొంచి ఉందని పట్టణవాసులు అంటున్నారు. ఈ ప్రకటనలు తొలగించాలని కోరుతున్నారు.

అనధికారికంగా వెలసిన ప్రకటనలు..

నేషనల్ హైవే వెంట గల డివైడర్ల మధ్యలో ప్రకటనలను పెట్టుకునేందుకు బాలాజీయాడ్స్ ఏజెన్సీని సంప్రదించాలి. కానీ.. అధికార పార్టీకి చెందిన వారు అనుమతి లేకుండానే.. డివైడర్ల మధ్యలో ప్రతి పది మీటర్లకు ఒకటి చొప్పున లాలీపప్ బోర్డులను ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫ్లెక్సీలు అంటించారు. దీంతో నేషనల్ హైవే అధికారులు ఇచ్చిన అనుమతులు బుట్టదాఖలయ్యాయని పట్టణవాసులు చర్చించుకుంటున్నారు.

హైవే మా పరిధిలో లేదు

పట్టణంలోని వై జంక్షన్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు మాత్రమే ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉంది. ఈదులగూడ చౌరస్తా నుంచి హనుమాన్‌పేట చౌరస్తా వరకు నేషనల్ హైవే పరిధిలో ఉంది. ఆ రోడ్డు డివైడర్ల మధ్య ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేసుకోవాలంటే నేషనల్ హైవే అధికారుల అనుమతులు తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న లాలీపప్ బోర్డుల ప్రకటనలకు అనుమతి ఉందో లేదో అన్న విషయం నాకు తెలియదు. – శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ, డీఈఈ

క్లుప్తంగా

'దోస్త్' రిజిస్ట్రేషన్‌కు నేడే చివరి తేదీ

రామన్నపేట: డిగ్రీ కళాశాలల్లో ఫస్టియర్‌లో చేరేందుకు గాను డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్)లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గురువారం చివరి తేదీ అని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్ ఖానం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులు, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ, బీజెడ్‌సీ, డైరీ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

స్వర్ణగిరీశుడికి అష్టదళ పాదపద్మార్చన సేవ



పాదపద్మార్చన సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి బుధవారం 108 బంగారు అష్టదళ పద్మపుష్పాలతో అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర మంగళహారతుల సమర్పణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



వెంకమ్మ (ఫైల్)

చిలుకూరు: చిలుకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తమ్మనబోయిన శంకర్ మాతృమూర్తి తమ్మనబోయిన వెంకమ్మ(105) బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమెకు ఐదుగురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు సంతానం. వెంకమ్మ కుటుంబంలో కుమారులు, కుమార్తెలు, మనమలు, మనవరాళ్లు, ముని మనవళ్లు, ముని మనవరాళ్లు కలిపి 60 మంది ఉన్నారు. వెంకమ్మ ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా వందేళ్లకు పైగా జీవించినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న ఆటో, ఆర్టీసీ బస్సు

- ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): ఆటో, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్లు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన ఉప్పుల శ్రీశైలం ఆటోలో పాల డబ్బాలతో సూర్యాపేటకు వెళ్తుండగా.. నెమ్మికల్లు గ్రామంలో సూర్యాపేట నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ శ్రీశైలంకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

స్పిల్‌వేను పరిశీలించిన నిపుణులు

- సాగర్ డ్యాం ఇంజనీర్లతో కలిసి మరమ్మతులపై అధ్యయనం



నాగార్జునసాగర్ స్పిల్‌వేను పరిశీలిస్తున్న కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డ్యాం స్పిల్‌వేను మరమ్మతుల నిపుణుల బృందం బుధవారం పరిశీలించింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్న తర్వాత క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసినప్పుడు అధిక ఒత్తిడితో స్పిల్‌వే మీద నుంచి జారి బక్కెట్ పోర్షన్ తాకి ఎగిసి పడతాయి. సుమారు 300 నుంచి 350 మీటర్ల ఎత్తు నుంచి అధిక ఒత్తిడితో నీరు పడటం కారణంగా స్పిల్‌వేపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. వీటిని ప్రతి సంవత్సరం మరమ్మతులు చేపట్టకపోతే డ్యాం పటిష్టతకు ఆటంకం ఏర్పడుతుంది. సాగర్ డ్యాం స్పిల్‌వే మరమ్మతులకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. ఎంత ఖర్చు చేసినా ప్రతి ఏడాది క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల చేసిన తర్వాత స్పిల్‌వే దెబ్బతినడం.. మరలా మరమ్మతులు చేపట్టడం సర్వసాధారణమైంది. గతేడాది కూడా రూ.20కోట్లతో స్పిల్‌వేకు మరమ్మతులు చేపట్టారు. కానీ నీటి విడుదల తర్వాత స్పిల్‌వే దెబ్బతిని గుంతలు ఏర్పాడ్డాయి. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ ఉన్నతాధికారులు, నిపుణుల కమిటీ సమావేశమై శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచనలు చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఎంవైకే ఆర్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు కులదీప్ తివార్, ఏఎస్ శ్రీకాంత్‌రాజ్, ఆదిత్య విక్రం వర్మ, సుజిత్ చంద్ర, ఎంజీ ప్రశాంత్‌లు డ్యాంను సందర్శించి స్పిల్‌వేను పరిశీలించారు. వీరితో పాటు సాగర్ డ్యాం ఇన్‌చార్జి ఎస్‌ఈ మల్లిఖార్జునరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ సత్యనారాయణ ఉన్నారు. స్పిల్ వే మరమ్మతులకు ఎలాంటి మెటీరీయల్‌ను వినియోగించాలి, వాటి సామర్థ్యం ఎంతమేరకు తట్టుకోగలదు వంటి విషయాలపై అధ్యయనం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మూడు దఫాలుగా ఎంవైకే కంపెనీ ప్రతినిధులు సాగర్ స్పిల్‌వేను పరిశీలించారు. ఈ బృందం పూర్తిస్థాయి నివేదికను ఉన్నత స్థాయి ఇరిగేషన్ అధికారులకు అందజేసిన తర్వాత ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి, అందుబాటులో ఉన్న కాలాన్ని బట్టి స్పిల్‌వేకు మరమ్మతులు నిర్వహించనున్నారు. వీరి ప్రతిపాదనలను ప్రభుత్వం ఒప్పుకుంటే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు సమయం సరిపోదు కాబట్టి దెబ్బతిన్న స్పిల్‌వేపై ఉన్న గుంతలకు మరమ్మతులు చేపట్టనున్నారు. జలాశయం నిండి క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల పూర్తయిన తర్వాత మరమ్మతులు చేసిన స్పిల్‌వే గుంతలు నీటి ప్రవాహాన్ని ఒత్తిడిని తట్టుకుని ఉండగల్గితే అప్పుడు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నారు.

గిడ్డంగుల్లో ధాన్యం నిల్వతో లాభాలు పొందవచ్చు

- జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ మరియాదాస్



మాట్లాడుతున్న మరియాదాస్

గరిడేపల్లి: గిడ్డంగుల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకుని రైతులు అధిక లాభాలు పొందవచ్చని జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ ఎ. మరియాదాస్ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వేర్ హౌజ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ యాక్ట్, నెగోషియబుల్ వేర్‌హౌజ్ రిసిప్ట్‌పై రైతులు, వ్యాపారులు, పప్పు మిల్లు యాజమానులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరియాదాస్ పాల్గొని మాట్లాడారు. రైతులు ధాన్యం నిల్వలో తగు జాగ్రత్తలు తీసుకోకుంటే 10 నుంచి 30శాతం ధాన్యం చీడ పురుగులు, ఎలుకల వల్ల నష్టం వాటిల్లుతుందని అన్నారు. ధాన్యం నిల్వపై ప్రతిఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రైతులను నేరేడుచర్లలోని స్టేట్ వేర్‌హౌజింగ్ కార్పొరేషన్ గిడ్డంగుల సంస్థకు తీసుకెళ్లి ధాన్యం నిల్వ గురించి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి. ఆదర్శ్, ఎ. కిరణ్, టి. మాధురి, సీహెచ్. నరేష్, రైతులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి యువకుడు మృతి

బీబీనగర్: సరదాగా ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో బుధవారం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో నివాసముంటున్న వెల్ల నందకుమార్ (23) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం బోడుప్పల్ నుంచి తన స్నేహితులను యాదగిరిగుట్ట దర్శనానికి తీసుకొచ్చాడు. తిరుగు ప్రయాణంలో బీబీనగర్ రాగానే వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఉన్న పెద్ద చెరువులో దిగి ఈత కొట్టేందుకు ఆగారు. చెరువులో ఈతకు దిగిన నందకుమార్ నీటిలో మునిగిపోయాడు. చెరువులో నుంచి నందకుమార్ బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన అతడి స్నేహితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో గాలించి నందకుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తల్లి ఇంద్రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏటీఎంల వద్ద మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమంద రాజు

హుజూర్‌నగర్: ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేసి ఇస్తానని అమాయకులను బురిడీ కొట్టించి డబ్బులు కాజేస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయవాడ కృష్ణలంకకు చెందిన చింతల సురేష్‌బాబు ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేసేందుకు వచ్చే అమాయకులు, వృద్ధులు, మహిళల ఏటీఎం కార్డులను తీసుకొని దాని స్థానంలో నకిలీ కార్డును వారికి ఇచ్చి.. ఆ తర్వాత వారి అసలు ఏటీఎం కార్డులను ఉపయోగించుకొని డబ్బులు కాజేస్తున్నాడు. గతేడాది నవంబర్ 19న హుజూర్‌నగర్‌కు చెందిన మంద విజయ కరుణ పట్టణంలోని ఓ ఏటీఎంలో డబ్బులు తీసేందుకు ఇతడి సహాయం కోరగా ఆమె చెప్పిన పిన్ నంబర్ ఉపయోగించి డబ్బులు డ్రా చేసి ఆమెకు డబ్బులతో పాటు నకిలీ ఏటీఎం కార్డును చేతిలో పెట్టి నిజమైన కార్డును తీసుకొని వేరే ప్రదేశాల్లో రూ.1.25 లక్షలు డ్రా చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సురేష్‌బాబుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్ద సురేష్‌బాబు అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 44 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న ఏఎస్ఐ బలరామిరెడ్డి, కానిస్టేబుళ్లు వరప్రసాద్, నాగరాజును సీఐ అభినందించారు.

సినీ ఫక్కీలో బంగారం చోరీ

- వృద్ధురాలిని మంచానికి కట్టేసి 9 తులాల బంగారంతో ఉడాయించిన కేటుగాళ్లు

నాగారం: సినీ ఫక్కీలో వృద్ధురాలిని మంచానికి కట్టేసి 9 తులాల బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటన మంగళవారం రాత్రి నాగారం మండలం ఈటూరు గ్రామంలో జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈటూరు గ్రామానికి చెందిన నంగునూరి బయ్యమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వీరందరికి వివాహాలు అయ్యాయి. బయ్యమ్మ కుమారుడు శ్రీరాములు ఉద్యోగ రీత్యా చెన్నైలో ఉంటున్నాడు. బయ్యమ్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. దీంతో ఆమె ఇంటి వద్ద ఒంటరిగానే ఉంటుంది. మంగళవారం రాత్రి బయ్యమ్మ ఇంట్లో నిద్రించగా.. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కరెంట్ పోయింది. దీంతో ఆమె ఇంటి బయటికి వచ్చి వరండాలో మంచం వేసుకొని నిద్రించింది. ఆమె నిద్రలోకి జారుకున్న కొద్దిసేపటికే నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనుక నుంచి వచ్చి బయ్యమ్మ రెండు చేతులను చీరతో మంచానికి కట్టి, నోట్లో గుడ్డలు కుక్కి ఆమె మెడలో ఉన్న 2తులాల బంగారు నల్లపూసల గొలుసు గుంజుకున్నారు. అనంతరం ఇంట్లోకి చొరబడి ఇంట్లోని ట్రంక్ పెట్టెలో దాచిన 4 తులాల బంగారు పెద్ద గొలుసు, 3 తులాల పుస్తెలతాడుతో పాటు ఆమె నడుముకున్న చెక్కుడు సంచిలో ఉన్న రూ.2500 లాక్కోని పారిపోయారు. బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయంలో రికార్డుల పరిశీలన

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన పలు రికార్డులను విజిలెన్స్ అధికారులు బుధవారం పరిశీలించారు. ప్రతి ఆరు నెలలు, ఏడాదికి ఒకసారి విజిలెన్స్ అధికారులు ఆలయంలో రికార్డులను పరిశీలించినట్లుగానే బుధవారం విజిలెన్స్ అధికారులకు ఆలయానికి వచ్చి రికార్డులు పరిశీలించినట్లు ఆలయ అధికారులు చెప్పారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారితో పాటు మరో ఐదుగురు సభ్యులతో కలిసి ఆలయ అకౌంట్ సెక్షన్‌లో రికార్డులను చూశారు. ఆలయానికి ఆదాయం ఎంత వస్తుంది, గతేడాది ఎంత వచ్చింది, రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు సరిగ్గా చెల్లిస్తున్నారా లేదా, నగలు ఎంత ఉన్నాయి, ఖర్చులు ఎంత అవుతున్నాయే అంశాలపై రికార్డులను పరిశీలించి వెళ్లారు. వారి వెంట ఆలయ డిప్యూటీ ఈఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, పలువురు ఉద్యోగులున్నారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరణ.. ఐదుగురికి రిమాండ్

నూతనకల్: నూతనకల్ మండలం యడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డు సైదులు, వనం రాజు, పిట్టల కృష్ణ, బొడ్డు రాజాలు, నెల్లుట్ల సైదులు గతంలో గ్రామంలో ఘర్షణకు పడగా.. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. అయితే వారు కేసు వాయిదాలకు హాజరుకాకుండా కోర్టు ధిక్కారణ చర్యలకు పాల్పడడంతో బుధవారం నాన్ బెయిలెబుల్ వారెంట్ కింద అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

రూ.3.50లక్షల విలువైన కిట్‌లు పంపిణీ



స్కూల్ కిట్‌లు అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ, తుపాకుల రవి

సంస్థాన్ నారాయణపురం: హైదరాబాద్‌కు చెందిన రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థాన్‌నారాయణపురంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం స్కూల్ కిట్‌లు అందజేశారు. 340 మంది విద్యార్థులకు రూ.3.50 లక్షల విలువ చేసే స్కూల్ కిట్‌లను డీఈఓ సత్యనారాయణ, ట్రస్ట్ ఎండీ తుపాకుల రవి అందజేశారు. రిలయబుల్ ట్రస్ట్ సహకారం అభినందనీయమని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకురావాలని డీఈఓ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎంలు రమాదేవి, ఉదయ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శివరంజని, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పర్నె శివారెడ్డి, సుక్క సుదర్శన్, ఆముదాల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఎదుర్కోలు మహోత్సవ సంవాదం జరిపించారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ పూర్తిగావించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో బేకరీలో మంటలు



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్: బేకరీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో బుధవారం జరిగింది. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద గల గోకుల్ బేకరీలో పై అంతస్తులో సామగ్రి నిల్వ చేసిన గదిలో బుధవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.4.50లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు రాహుల్ అగర్వాల్ తెలిపాడు.

తప్పు అధికారులది.. శిక్ష వినియోగదారుడికి..

- గృహ వినియోగానికి కమర్షియల్ విద్యుత్ మీటర్ ఇచ్చిన అధికారులు
- కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుండడంతో మీటర్ మార్పు
- బిల్లు సరిచేస్తామని చెప్పి ఏళ్ల తరబడి సాగదీత
- మొత్తం బిల్లు చెల్లించాలంటూ విద్యుత్ సరఫరా నిలిపివేత



బాధితుడు లింగయ్య

నల్లగొండ: విద్యుత్ శాఖ అధికారులు చేసిన తప్పిదానికి వినియోగదారుడు బలైన సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. గృహ వినియోగానికి.. కమర్షియల్ విద్యుత్ మీటర్ అమర్చడంతో ఒక్క నెలలోనే రూ.1.50లక్షల కరెంట్ బిల్లు వచ్చింది. ఇదేమిటని సదరు వినియోగదారుడు విద్యుత్ అధికారుల వద్దకు వెళ్తే.. కమర్షియల్ మీటర్ తీసేసి గృహానికి సంబంధించిన మీటర్ పెట్టారు. కానీ పాత బిల్లు సరిచేస్తామని చెప్పిన అధికారులు ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోలేదు. తాజాగా బిల్లు మొత్తం చెల్లించాలంటూ విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

ఐదేళ్లుగా కాలయాపన..

నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చంద్రగిరి విల్లాస్‌లో నివాసముంటున్న మేడి లింగయ్య అలియాస్ లింగస్వామి ఇంటికి 2014లో (సర్వీస్ నంబర్ 0401402486) కమర్షియల్ మీటర్‌ను విద్యుత్ అధికారులు పెట్టారు. అయితే లింగయ్య పని నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటాడు. ప్రతి నెల నల్లగొండకు వచ్చినప్పుడల్లా కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తున్నా కూడా కడుతూ వచ్చాడు. కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని 2020లో విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. మీటర్ చెక్ చేస్తామంటూ డీడీలు కూడా కట్టించుకున్నారు. ఈ మేరకు మీటర్‌ను చెక్ చేసి అది కమర్షియల్ మీటర్ అని అధికారులు రిపోర్టు ఇచ్చి ఆ మీటర్‌ను మార్చారు. అప్పటి వరకు కరెంట్ బిల్లు రూ.1.50లక్షలకు చేరుకుంది. మీటర్ మార్చిన సందర్భంలో పాత బిల్లంతా రివైజ్ చేస్తామని చెప్పడంతో లింగయ్య దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు విద్యుత్ అధికారులు, ఏడీఏలు కూడా సంతకం చేసి అంగీకరించారు. ఆ తర్వాత బిల్లు తగ్గించకుండానే కొత్త బిల్లుతో పాటు పాత బిల్లు కలుపుతూ వస్తున్నారు. ఈ విషయంపై ఏఈ, డీఈ, ఎస్‌ఈలతో పాటు విద్యుత్ వినియోగదారుల ఫోరంలో కూడా లింగయ్య దరఖాస్తులు ఇవ్వడంతో బిల్లును సరిచేస్తామని చెప్పి దాటవేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆ బిల్లు రూ.1.79లక్షలకు చేరుకుంది. అయితే బిల్లు మొత్తం చెల్లించాలంటూ మంగళవారం లింగయ్య ఇంటికి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో అతడు విద్యుత్ ఆపరేషన్స్ ఎస్‌ఈ వద్దకు వెళ్లి ప్రశ్నించగా.. విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరించారు. కానీ బిల్లులో ఎలాంటి మార్పు చేయలేదు. దీంతో లింగయ్య న్యాయపరంగా ముందుకు వెళ్తానంటూ సాక్షికి వివరించాడు. విద్యుత్ అధికారులు చేసిన పొరపాటును సరిదిద్దుకోకుండా తనను ఇబ్బందులకు గురిచేస్తూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని లింగయ్య వాపోతున్నాడు.

అబద్ధాలతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

- గత యాసంగిలో రైతులకు రూ.800 కోట్లు బాకీ పడ్డారు
- కక్ష సాధింపులో భాగంగానే కేటీఆర్‌కు నోటీసులు
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నల్లగొండ టూటౌన్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో పాలన సాగిస్తోందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెడతారనే భయంతో రైతులకు రైతు భరోసా ఇస్తున్నారని అన్నారు. ఒక్కో రైతుకు పాత బకాయి రూ.30వేలు ఉందని, ఇలా గత యాసంగిలో ఉమ్మడి జిల్లా రైతులకు రూ.800కోట్లు రైతు భరోసా నిధులు బాకీ పడ్డారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా రైతులకు ఇప్పించే బాధ్యత జిల్లా మంత్రులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాకు కాంగ్రెస్ మంత్రులు చేసిందేమీ లేదని, చేతగాని మంత్రులుగా మిగిలిపోయారని విమర్శించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కబ్జాలు, అక్రమాలకే పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. వారికి కమీషన్లు వచ్చే పనులను పట్టుకుని ముఖ్యమంత్రి చుట్టూ తిరిగేందుకు సమయం సరిపోతలేదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో చేస్తున్న విచారణ ఓ బూటకమని, ఫార్ములా–ఈ కేసులో ఏం జరగకపోయినా కేటీఆర్‌పై కక్ష సాధింపులో భాగంగానే నోటీసులు, విచారణ అంటూ వేధిస్తున్నారని అన్నారు. కేటీఆర్‌పై ఇప్పటి వరకు 14 కేసులు అక్రమంగా పెట్టారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ భయపడదని, ప్రజల తరఫునన ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, హామీల అమలుపై పోరాటమని చేస్తామని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్‌దే విజయమన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళ మృతికి కారణమైన ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రాజశేఖర్

తాళ్లగడ్డ (సూర్యాపేట): మహిళ మృతికి కారణమైన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ రాజశేఖర్ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండలం కోటపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని తెట్టికుంట తండాకు చెందిన బాణోతు విజయ (36)ను అదే తండాకు చెందిన బాణోతు ఉపేందర్ లైంగికంగా వేధిస్తూ తరచూ ఫోన్ చేసి ఇబ్బంది పెట్టేవాడు. ఈ నెల 13న ఉదయం కూడా ఉపేందర్ విజయకు ఫోన్ చేయగా ఆమె కుమార్తె అఖిల ఎత్తింది. ×మీ అమ్మ ఎటు వెళ్లింది¥ అంటూ దుర్భాషలాడాడు. కాసేపటికే ఉపేందర్ భార్య శారద విజయ ఇంటికి వెళ్లి తన భర్తతో వివాహేతర సంబంధంపై ప్రశ్నించడంతో విజయ మనస్తాపం చెంది అదే రోజు పొలం దగ్గర పురుగుల మందు తాగింది. అనంతరం ఇంటికి వచ్చిన విజయ వాంతులు చేసుకోవడంతో ఆమె కుమార్తె గ్రామస్తుల సాయంతో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఈ నెల 15న మృతిచెందింది. విజయ భర్త బాలు ఫిర్యాదు మేరకు బాణోతు ఉపేందర్, బాణోతు శారద, ఉపేందర్ అన్న గంగరాజు, వదిన మంగమ్మపై ఆత్మకూరు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం బాణోతు ఉపేందర్, అతని భార్య శారదను రూరల్ సీఐ రాజశేఖర్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఉపేందర్ అన్న గంగరాజు, వదిన మంగమ్మ పాత్ర గురించి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కార్యక్రమంలో ఆత్మకూర్ ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఈసీ గ్రూప్ అప్పాజిపేటకు తరలింపు

- మోటకొండూర్ బాలికల గురుకుల పాఠశాల నుంచి తరలించడంతో విద్యార్థినులకు ఇబ్బందులు



మోటకొండూర్‌లోని బాలికల గురుకుల పాఠశాల

మోటకొండూర్: మోటకొండూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ సీఈసీ గ్రూప్‌ను నల్లగొండ మండలంలోని అప్పాజిపేటలో గల బాలికల గురుకుల పాఠశాలకు తరలిస్తున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోటకొండూర్ గురుకుల పాఠశాలలో గతేడాది బైపీసీ, సీఈసీ, ఎంపీసీ గ్రూప్‌లలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యను బోధించారు. కాగా ఈ సంవత్సరం అడ్మిషన్ల సమయంలో కూడా ఆన్‌లైన్‌లో ఇంటర్ సీఈసీ మోటకొండూర్ చూపించడంతో విద్యార్థులు ఆప్షన్ ఇచ్చుకున్నారు. తీరా ఇక్కడికి వచ్చిన విద్యార్థులకు మాత్రం నల్లగొండ మండలంలోని అప్పాజిపేట గురుకుల పాఠశాలలో సీఈసీ బోధన ఉంటుందని ప్రిన్సిపాల్ జ్యోతి చెబుతున్నారు. ఇంటర్ సీఈసీ సబ్జెక్టులు బోధించడానికి సరైన ఫ్యాకల్టీ, తరగతి గదులు లేవని దీంతో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం సీఈసీని అప్పాజిపేటలోని గురుకులంలో నిర్వహిస్తారని ఆమె తెలిపారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో చూపించకుండా అక్కడే చూపిస్తే మేము ఆప్షన్ పెట్టుకోకుండా ఉండేవారమని, అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ద్వితీయ సంవత్సరం కూడా ఇక్కడే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈతకు వెళ్లి రైల్వే ఉద్యోగి మృతి



సందీప్ మృతదేహం

డోర్నకల్: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన రైల్వే ఉద్యోగి ప్రమాదవశాత్తు నీటమునిగి చనిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఎర్రంశెట్టి సందీప్(28) డోర్నకల్‌లో రైల్వే ట్రెన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం మిత్రులతో కలిసి సరదాగా మున్నేరువాగులో ఈతకు వెళ్లాడు. అక్కడ మిత్రులు ఈత కొడుతుండగా ఈతరాని సందీప్ వాగు ఒడ్డున నీటిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు వాగులోకి జారి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారుల సాయంతో వాగులోనుంచి సందీప్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడికి నాలుగు నెలల క్రితం వివాహం జరిగినట్లు సమాచారం.